**చిన్నకథ**

# ఉనికి

''నేను ఎవరు?'' అడిగాడు అతను- తనకు ఎదురైన ఒకర్ని ఆపి.

ఆగిన ఆయన అతన్ని ఎగాదిగా చూసి తప్పుకుని వెళ్ళాడు.

అతను ముందుకు కదులుతూ నేరుగా బస్టాప్ వద్ద నిలిచాడు.

''నేను ఎవరు?'' అడిగాడు మళ్ళీ అక్కడ.

అతన్ని అక్కడి వారు-

వింతగా చూశారు. చిత్రంగా చూశారు. చిరాకుగా చూశారు. భయంగా చూశారు. అయోమయంగా చూశారు. చిన్నగా నవ్వుతూ చూశారు.

నేను మాత్రం మామూలుగానే ఉన్నాను. అతన్ని గమనిస్తున్నాను, చాలా సేపటి నుండి. నేను ఒక దినపత్రిక విలేకరిని. అతని ప్రవర్తన కుతూహలంగా ఉంది. అతను వచ్చి నన్ను అడిగాడు: ''నేను ఎవరు?'' నేను మాత్రం, ''వేదాంతమా?'' అన్నాను.

''కాదు'' అన్నాడు అతను. అప్పుడు, ''ఏమిటీ పిచ్చిపని!'' అన్నాను. ''నన్ను ఎరిగినవారు ఎంత మందో తెలుసుకుంటున్నాను'' చెప్పాడు అతను.

''అర్థం కావడం లేదు'' అన్నాను. అక్కడ స్టాప్‌లో మిగతా వారంతా మా ఇద్దర్నే చూస్తున్నారు. ''అర్థం కాకపోవడం ఏమిటి?!'' అన్నాడు అతను.

అంతలోనే బస్సు ఒకటి అటు రావడంతో వాళ్ళలో చాలా మంది ఆ బస్సు ఎక్కారు, మా వంక చోద్యంగా చూస్తూ. బస్సు వెళ్ళిపోయింది.

నేను అతని వంక తిరిగి, ''మీ తీరు విచిత్రంగా ఉంది'' చెప్పాను మామూలుగానే. ''అయ్యో, 'నేను ఎవరు?' అన్నది ఎంత మందికి తెలుసో తెలుసుకోవాలనుకుంటున్నాను. దీనిలో విచిత్రం ఏమిటి!'' అడిగాడు అతను.

''విచిత్రం కాదా?'' ''కాదు!'' ''ఎలా?'' ''ఎలా అంటే, నా భార్యని అడిగాను- 'భర్త' అంది. నా పిల్లల్ని అడిగాను-'నాన్న' అన్నారు. నా తల్లిదండ్రుల్ని అడిగాను- 'బిడ్డ' అన్నారు. నా బంధువుల్ని అడిగాను- 'వరుస' అన్నారు. నా చుట్టూవారిని అడిగాను- 'తెలిసిన వాడ్ని' అన్నారు. కానీ, అంతే, పరిమితం... చాలా పరిమితం. మిగతా వారికి 'నేను ఎవరు?' తెలియదే! అదీ విచిత్రం...'' నా తల తిరిగినట్టయ్యింది. తల విదిలించుకున్నాను. గుండెనిండా గాలి పీల్చుకొని, దానిని నెమ్మదిగా వదిలాను. అతను మాట్లాడుతూనే ఉన్నాడు. ''...ఆయన్ని అంతా చూశామా? మరి ఆయన్ని మనం 'మహాత్మా' అంటున్నాం...''

''ఆయన తన పట్టుదలతో మన ఉనికిని నిలిపారు కనుక''

అతను నన్ను పట్టించుకోవడం లేదు.

''...స్టార్ అంటున్నాంగా ఆయన్ని మనమంతా...''

''ఆయన తన నటనతో మనను వినోదపరుస్తున్నారు కనుక''

అబ్బే, అతని ధోరణి అతనిదే...

''...ఛాంపియన్ అంటున్నాంగా ఆయన్ని మనమంతా...''

''ఆయన తన ఆటతో మనను ఉత్సాహపరుస్తున్నారు కనుక''

అతను చెప్పుకుపోతున్నాడు...


అయ్యో, అతను నా మాటలు పట్టించుకోడే!

అతని భుజంపట్టి గట్టిగా కదిపాను.

''మీరు నా మాటలు వినండి'' అన్నాను.

అతను మాటలు ఆపాడు. నా వంక చూస్తున్నాడు.

అప్పటికే అటు మరో బస్సు వచ్చి, వెళ్ళింది. అక్కడ మేమిద్దరం తప్ప మరొకరు లేరు. ''ఇంతకీ మీరు ఏమంటారు?'' అడిగాను సాధ్యమైనంత సున్నితంగా. ''మరే, 'నేను ఎవరు?' అన్నది వాళ్ళలా... పదిమందికీ తెలియాలి'' చెప్పాడు అతను. ఇతనిది 'కీర్తి కాంక్షా'?!- ఏమో- తేల్చుకోదలిచాను. అడిగాను: ''ఎందుకు?'' అని. ''పుట్టాను, బ్రతికాను, చచ్చాను... తప్ప నాకు ఇంకేమీ లేవా? వాళ్ళలా, 'నేను ఎవరు?' అన్నదీ



చెప్పుకోరా?'' అడిగాడు అతను.

అతని భుజం మీద చెయ్యివేశాను.

ఇద్దరం బస్టాప్‌లోని బెంచీ మీద కూర్చున్నాం.

''వాళ్ళు గొప్పవారు'' అన్నాను.

''ఎలా?'' అడిగాడు అతను వెంటనే.

''వారు వారంతా తమ తమ పరిధిలో మంచివారు...''

''నేను చెడ్డవాణ్ణీకాదే'' అన్నాడు అతను అడ్డుపడి.

''కాకపోవచ్చు. కానీ వారి కృషి వేరు... మీరూ అలా ఏదైనా కృషి చేయండి'' అన్నాను నవ్వుతూ. ''ప్చ్. నాకు అవకాశమే లేదైతే'' అతనిలో ఒక్కమారుగా నిరుత్సాహం అగుపించింది. అతను తల దించుకొని ఉన్నాడు.

ఉత్సాహపర్చాలనిపించింది. అన్నాను: ''వద్దు... తల దించుకోవద్దు. మీకు ఏం తక్కువ''

''ఆయుష్షు''

''అదేమిటి!''

''నాకు జబ్బు. డాక్టర్లు నయం అవుతుందనే నమ్మకం ఇవ్వలేదు''

నేను గతుక్కుమన్నాను. ''నేను చనిపోయేలోగా నా కోరిక తీరేది ఎలా?'' అడిగాడు గొణుక్కుంటున్నట్టు అతను.

''మీ జబ్బు ఏమిటి?'' అడిగాను. ''మెదడులో అసక్రమ చర్యట. అరుదైనదట'' అతనిపై జాలి వేసింది. ''మీ సంగతి విలక్షణమైనది. కుతూహలమైనది. స్పందించదగ్గది.

మీ గురించి రాస్తాను. మా దినపత్రికలో రేపే వస్తుంది. మీకు జవాబు చూపుతాను. ఇంటికి వెళ్ళండి. మిమ్మల్ని తప్పక కలుస్తాను'' అంటూ అతని వివరాలు, విలాపం తీసుకున్నాను. అతన్ని ఫొటో కూడా తీశాను.

తెల్లవారింది.

పేపరులో ఫొటోతో సహా అతని గురించి నా రాత అచ్చయ్యింది. అది బాక్సు ఐటమ్‌గా రంగుల్లో వచ్చింది. అది మొదలు ఆ వార్తపై ఫోన్స్, ఈ-మెయిల్స్, యస్‌యంయస్‌లు పత్రికా కార్యాలయానికి రావడం మొదలయ్యాయి.

ఎన్నో, ఎన్నెన్నో స్పందనలు...సూచనలు...

అతని కోరిక 'ఇలా కూడా తీరింద'ని చెప్పడానికి ఆ పేపరుతో ఉత్సాహంగా అతని ఇంటికి వెళ్ళాను.

'రాత్రే అతను చనిపోయాడ'ట.

నేను చలించాను.

-బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు